31

# ఆపదమొక్కు

పొడ ఎండ చురుక్కున తగిలేసరికి మెలకువ వచ్చింది. మెలకువ అయితే వచ్చిందిగాని-నిద్రమత్తు ఇంకా వదల్లేదు. చెట్టుకింద ఆ పొడ ఎండలో పడుకోలేక, మత్తుగా ఇంట్లోకి నడిచాను. ఇంట్లోకి వెళ్ళి మంచంమీద నడుం వాల్చేవాణ్నేగానీ-అక్కడ నేను చూచిన దృశ్యాలు, నా కళ్ళమీదున్న మత్తును కాస్త దూదిపింజలా ఎగురగొట్టాయి.

నా కళ్ళల్లో నిద్రమత్తుకి బదులు ఆశ్చర్యం చోటుచేసుకుంది. కొంపదీసి కలగనడం లేదు గదా! అనుకున్నాను. కళ్ళు చిలికించి చూశాను. కల కాదు! పచ్చి నిజాలు! మా మూడేళ్ళ అనూరాధ టెర్రిలిన్ రెడీమేడ్ ఫ్రాకులో-చూడ ముచ్చటగా కన్పిస్తోంది. ఎంతలేదన్నా-అది వేసుకున్న ఫ్రాకు ఖరీదు పాతిక రూపాయలకు తక్కువ వుండదు! మా చంటాడు నేలమీద బోర్లా పడుకుని బిస్కట్ చప్పరిస్తున్నాడు! అదీ ఖరీదయిందే.

నేను చూచిన దృశ్యాలు అంతటితో ఆగలేదు మా ఆవిడ తలనిండా రంగు రంగుల పూలు! ఇక పెళ్ళీడుకొచ్చిన మా చెల్లి అమూల్యవిషయం సరేసరి. టెర్రిలిన్ చీరె, ఫుల్‌వాయిల్ బ్లౌజుతో-దాని ముఖాన ఏదో కొత్త వెలుగు వెల్లి విరుస్తోంది.

ఇదంతా చూచిన తర్వాత-నేను అప్రతిభుణ్ణయిపోయి అమాంతం నోరు తెరిచేను. ఏ ఆఫీసరు ఇంట్లోనో వుండవలసిన వాతావరణం! పదెకరాల మెట్టపొలమూ, ముష్టి ముప్ఫయి రూపాయల మునసబు గిరి ఉద్యోగమూ-ఇదీ నాస్థితి! నాస్థితికి మించిన వాతావరణం-నా ప్రమేయంలేకుండా-నా ఇంట్లో కనిపిస్తోంది. ఆశ్చర్యపడటానికి, అప్రతిభుణ్ణయి పోవడానికి-ఇంతకన్నా ఏం కావాలి?

మా ఆవిడని పిలిచి అడిగేను "ఏమిటి ఇదంతా?" అని. మా ఆవిడ ముసి ముసి నవ్వులు విసురుతూ అన్నది. "మీ రాజమ్మ పిన్నిగారొచ్చారు. ఆవిడ బహుమానాలే ఇవన్నీ."

రాజమ్మపిన్ని! ఇవరీ రాజమ్మపిన్ని?నాకు తల్లివైపూ, తండ్రివైపూ కూడా చెప్పుకోతగ్గ బంధు బలగం లేదు. ఒక వేళ వున్నా, ఇంత ఖరీదయిన బహుమతులు తెచ్చే పిన్నిగారు లేరు. కాసేపు అయోమయంలో పడ్డ తర్వాత "రాజమ్మపిన్ని ఇంట్లో వున్నదా ఇప్పుడు" అన్నాను.

"లేదండీ! ఇప్పుడే వూర్లోకి వెళ్ళింది. మీరు లేస్తారని చాలాసేపు చూచింది పాపం. మీ నిద్రకు తెగడే లేదు. ఆవిడ చూచి చూచి ఇప్పుడే వెళ్ళింది" అన్నది మా ఆవిడ.

అమ్మని కేకేసేను. వంటింట్లోంచి. అమ్మ వచ్చింది.

"ఎవరమ్మా రాజమ్మపిన్ని?" అన్నాను ఆత్రుతగా.

"నీకు తెలీదులేరా. రాజమ్మపిన్నిది ఈ వూరే. ఎప్పుడో నీ చిన్న తనంలో వూరు విడిచారు. ఆవిడ భర్త శ్రీనివాసరెడ్డి అని చిత్తూరులో తహశీల్దారుగా ఉంటున్నాడు" అన్నది అమ్మ.

నేను వాళ్ళని చూడనిమాట నిజమేకాని-తహశీల్దారుగా వుంటున్న శ్రీనివాసులురెడ్డిగారి పేరు నాకు తెలుసు. ఆయనకు మా వూర్లో సాగులో లేని నాలుగెకరాల పొలంకూడా వున్నది. మునుపటి విషయం ఏమోకానీ, నాలుగేళ్ళుగా దానికి ఆయన శిస్తుకూడా చెల్లించడం లేదు. ప్రతి సంవత్సరం ఆ శిస్తు తాలూకు డబ్బులు చేతినుంచి అచ్చుకుంటున్నాను. నాలుగో నెంబరు కింద రాసిపడేస్తే సరిపోవునుగానీ-బద్ధకించి-ఆపని చెయ్యలేదు.

"మనకి వాళ్ళు బంధువులా అమ్మా, ఎప్పుడూ చెప్పావుకాదే" అన్నాను. మా అమ్మ రాజమ్మపిన్నికీ, మాకూ వున్న బంధుత్వం విశదీకరించింది.

మా అమ్మ చెపిందాన్నిబట్టి, వాళ్ళకూ మాకూ వున్నది కేవలం బాదీరాయణ సంబంధం! అంతకన్నా మరేంలేదు.

ఆ సంబంధం పురస్కరించుకొని, రాజమ్మపిన్ని మా యింటికి అంతదూరాన్నుంచి పనిగట్టుకరావడం-అందునా ఇన్ని బహుమతులు పట్టుకొని రావడం-నన్ను చకితుణ్ణిచేసింది! ఆవిడకి మా మీదగల అవ్యాజానురాగానికి-నా హృదయం పులకితమైపోయింది.

"రాజమ్మపిన్ని, దేవతలాంటి మనిషిరా" అన్నది అమ్మ గంభీరంగా ముఖంపెట్టి. కాదనడానికి, నాకుమాత్రం నోరెలా వస్తుంది? ఉన్నటుండి. రాజమ్మపిన్ని దేవత్వాన్ని నిరూపించే మరోవిషయం బయటపెట్టింది అమ్మ.

"రాజమ్మపిన్ని, అమూల్య పెళ్ళికి డబ్బుకూడా అప్పుపెడతానంటోంది. పెళ్ళి అయిన తర్వాత నిదానంగా అప్పుతీర్చుకోమంటోంది."

మా అమ్మ కళ్ళలో కృతజ్ఞతా, సంతోషం, తొణికిసలాడాయి.

నా మట్టుకు నాకు స్వర్గసోపానా లెక్కుతున్నట్టనిపించింది. నా అసమర్థతకి చిహ్నంగా-అమూల్యా నా కళ్ళముందు తిరుగుతోంది. దాని పెళ్ళి ఎప్పుడో కావలసింది. డబ్బులేక, దాని పెళ్ళి, ఏయేటి కా యేడు పై ఏటికంటూ వాయిదా వేసుకొస్తున్నాను. ఇన్నాళ్ళకి, ఆ డబ్బు సమస్యకూడా-రాజమ్మ పిన్ని మూలాన పరిష్కారమవుతున్నది.

నేను చూడని రాజమ్మపిన్ని, నా మనోనేత్రం ముందు సాక్షాత్కరించింది. నిజంగానే ఆవిడ దేవత! మనసులోనే, ఆమెకి భక్తి పురస్సరంగా నమస్కరించేను. ఆవిడపట్ల నా కృతజ్ఞతని ఎట్లా ప్రకటించాలో కూడా అర్థం కావడంలేదు.

ఊర్లో అక్కడా అక్కడా తిరిగి రాజమ్మపిన్ని చీకటి పడేవేళకి ఇల్లుచేరుకుంది. కాస్తి లావుపాటి విగ్రహం. కట్టుకున్న చీరె, పెట్టుకున్న నగలు ఆవిడ ఐశ్వర్యాన్ని చాటుతున్నాయి. మనిషి మంచి మాటకారిలా వుంది. కొత్తా పాతా లేదు. నన్ను చూస్తూనే మాటల్లోకి దిగింది. "ఏరా, నాయనా నా కళ్ళముందు పుట్టినవాడివి, అప్పుడే ముసలాడికి మల్లే కన్పిస్తున్నావు. మీ అమ్మని అడుగు, నీ చిన్నతనంలో నిన్ను నేను ఎత్తుక తిరిగాను" ............ ఇట్లా సాగింది ఆవిడ మాటల ధోరణి.

రాజమ్మపిన్ని మాట్లాడుతూంటే నాకు మహదానందమయింది. డబ్బున్న మనిషికదా-ఆవిడ మాటల్లో, ఏ కోశోనా డాబూ దర్పంలేదు. అహంకారంలేదు. ఇట్లాంటి భోళా మనుషులు ఎంతమంది ఉంటారు? భోజనాల తర్వాత, "ఒరే అబ్బీ నువ్వు నాకో సాయం చేసిపెట్టాలిరా?" అన్నది రాజమ్మపిన్ని.

రాజమ్మ పిన్ని ప్రాణం అడిగితే కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. అయినా రాజమ్మ పిన్నికి నేను చెయ్యగల సాయం ఏమిటో అంతుపట్టలేదు.

"ఏమిటి పిన్నీ" అన్నాను.

"ఏం లేదు. ఈ వూర్లో మాకునాలుగెకరాల పొలంవున్న విషయం నీకు తెలిసే ఉంటుంది! మీ చిన్నాయన దాన్ని సాగులోకి తేవాలంటున్నాడు. ఈ విషయంలో నువ్వు మాకు సాయంచేశావంటే...."

రాజమ్మ పిన్ని బాగుకోసం, ఏదో రకంగా ఉపకరించగలనేమోనన్న అభిప్రాయంలో ఉన్నాను. తీర రాజమ్మ పిన్ని నానుంచి ఆశించే ఉపకారం విన్నాక, నీరుకారిపోయాను. ఆ భూమి వట్టి చవటపఱ్ఱు. వరద ముంచెత్తినా దాంట్లో గొర్రు చాలు పదునుకాదు. దాన్ని సాగుచేసి పండించట మేమిటి? పెట్టిన ఖర్చులు గిట్టవు. చేతి చమురు భాగోతం అవుతుందే తప్ప, వీస మెత్తు లాభం ఉండదు!

"నీ తలలోకి ఎవరు ఎక్కించారు పిన్నీ ఈ అభిప్రాయాన్ని" అన్నాను.

"ఒకరు ఎక్కించడ మేమిట్రా? మాకే కలిగింది. మేమూ నీలాగే రైతు బిడ్డలం కాదట్రా. పొలం పండిస్తున్నామంటే, అదో తృప్తి" అన్నది.

సవాలక్ష విధాల బోధించి చూశాను. నా బోధలు, ఆవిడ చెవి కెక్కలేదు. పాపం అమాయకురాలు. వ్యవసాయం విషయం ఏంతెలుస్తుంది వారికి? రాజుల సొమ్ము రాళ్ళపాలంటారే-ఇలాటిదే కాబోలను కున్నాను. ఏదియేమైనా రాజమ్మ పిన్నికి కల్గిన ఈ

అభిప్రాయానికి, నాకు చాలా బాధే కలిగింది. మా కుటుంబం పట్ల అపారమైన అప్యాయత కనబరుస్తోన్న' రాజమ్మ పిన్నికి-నా ద్వారా ఉడుతాభక్తి, ఏదో ఉపకారం జరగడం పోయి అపకారమే జరుగుతోంది. నాకు ఏం చెయ్యడానికీ పాలుపోలేదు.

"ఒరేయి, నువ్వు పిచ్చి పిచ్చి ఆలోచనలు చెయ్యకు. లాభ నష్టాల బేరీజు వెయ్యడానికి, మనమేం వ్యాపారం చెయ్యడంలేదు. వ్యవసాయం చేస్తున్నాము. వ్యవసాయం చేసి పంటలు పండిస్తున్నాము అంటే దేశ సౌభాగ్యానికి పాటుపడుతున్నామన్న మాట."

రాజమ్మ పిన్నిది యెంత విశాల దృష్టో బోధపడిపోయింది. సంకుచిత్వంతో, ఆవిడను వారించడానికి చేసిన ప్రయత్నం తలచుకొని సిగ్గుపడి పోయాను!

"సరే పిన్నీ యెవరు కాదన్నారు. అలాగే చేద్దాం" అన్నాను.

నా అంగీకారంతో రాజమ్మ పిన్ని సంతృప్తిగా వూపిరి పీల్చింది. పర్సులోంచి, వందరూపాయల నోట్లు నాలుగు నాచేతి కిచ్చి,

"ఒరే నాక్కావలసింది, దాన్ని చక్కగా సాగుచేసి, విత్తనం వెయ్యడం. డబ్బుకు జంకకు. అవసరమనుకుంటే డబ్బుకు మళ్ళీ ఉత్తరం రాయి. అన్నట్టు నువ్వు డబ్బుకు జమాఖర్చులు రాయనవసరం లేదు. నువ్వు నాకేం పరాయి వాడివి కాదులే. పిల్లకుంకవి నీకేం తెలుస్తుంది. కావలిస్తే మీ అమ్మని అడుగు చెపుతుంది. పోతే. ఏమిటి చెప్మా జ్ఞాపకం రావడం లేదు ......... ఆ అమూల్య పెళ్ళి విషయం! డబ్బు ఇబ్బందితో దాని పెళ్ళి వాయిదా వేశావటగా! డబ్బులేదని ఆడపిల్లల పెళ్ళిల్లు ఆపుతారటరా పిచ్చి సన్నాసీ? వెళ్ళగానే మీ చిన్నాయనతో చెప్పి, డబ్బు పంపే ఏర్పాటుచేస్తాను. వెంటనే మంచి సంబంధం యేదన్నా ఉంటే చూడు."

మరుసటి రోజు రాజమ్మ పిన్ని ఇంటిల్లిపాదితో సెలవు తీసుకొని బయలుదేరింది. రాజమ్మ పిన్ని వెళ్ళిపోతూంటే-ఆత్మీయులు దూరమవుతున్నట్టనిపించింది.

ఇక రామకార్యంలా భావించి చెయ్యవలసిన పని మిగిలిపోయింది. మరుసటిరోజు రాజమ్మపిన్ని పొలానికి వెళ్ళి చూచాను. దాన్ని చూస్తుంటే గుండె లదిరాయి. అది పొలంకాదు. దండకారణ్యం. దాన్నిండా చీకి తుమ్మ చెట్లూ, తంగేడు చెట్లూ, స్వైరవిహారం చేస్తున్నాయి.

కూలీలను పిలిచి అవన్నీ కొట్టించాను. సంవత్సరానికి సరిపడే వంట కట్టెలు లభ్యమయ్యాయి. ఇక దాన్ని దున్నడం ఎడ్లతో అయ్యే పనికాదు రష్యన్ ట్రాక్టర్ని ఉపయోగించేను. అంత పెద్ద యంత్రమూ యమయాతన పడ్డది పాపం! దున్నలేక అది చేసే ఘీంకారాలకి చెవులు చిల్లులు పడ్డాయి.

ఎలాగయితేనేం పొలం ఒక రీతికి వచ్చింది. నా బాధ్యత దాదాపు తీరిపోయింది. ఇక వర్షం వస్తే, ఏదో తిప్పలునుండి విత్తనం వెయ్యవచ్చు. విత్తనం మొలవడమూ, పండటము దైవాధీనం! దాన్ని సాగుచెయ్యడానికి పెట్టిన ఖర్చు, 'తడిసి ముప్పందుమయింది.' రాజమ్మ పిన్ని ఇచ్చిన నాలుగు వందల్లో దమ్మిడీ మిగల్లేదు.

పని పూర్తిచేసి రాజమ్మపిన్నికి వుత్తరం రాశాను. వర్షం వచ్చాక అందులో ఏం విత్తాలో తెల్పమనిగూడా రాశాను.

నాలుగురోజుల తర్వాత రాజమ్మ పిన్ని నుంచి ప్రత్యుత్తరం వచ్చింది. రాజమ్మపిన్ని దగ్గరనుంచి ఉత్తరమనేసరికి, చేస్తున్న, పనులు వదిలి, ఇంటిల్లిపాదీ నాచుట్టూ చేరేరు. ఉత్తరం తీసి చదివేను.

ఒరే రామూ!

నీ ఉత్తరం అందింది!పొలం విషయంలో చాలా శ్రమ తీసుకుని పని పూర్తి చేశావు. నువ్వు చెయ్యగల వన్న విశ్వాసంతోనే, ఆ పని నీ కప్పగించేను.

అమూల్య పెళ్ళికి డబ్బు విషయం, మీ చిన్నాయన్ని కదిపేను. ఆయన ఎంతో సంతోషించేడు. నాకు నాలుగు చీవాట్లు కూడా పెట్టేడు. "వాడు కష్టాల్లో వున్నప్పుడు మనం ఆదుకోకపోతే. ఇంకెవరాదుకుంటారే పిచ్చి మొగమా? అసలు ఈ విషయంలో నీకు నా పర్మిషన్ కావలసి వచ్చిందా? వెంటనే డబ్బు పంపు" అన్నాడు. ఆయనది సుతిమెత్తని గుండెరా రామూ. డబ్బు ఇవ్వాళే ఎమ్.ఓ. చేస్తున్నాను. చేరిన వెంటనే ఆ మొత్తానికి బాండు రాసి పంపు. కొంపదీసి నీమీద విశ్వాసం లేదనుకునేవు. అదేం కాదు. వూరికే గుర్తుకోసం అడుగుతున్నాను.

అన్నట్టు ఇంకో ముఖ్యమైన విషయం. కాస్త రహస్యంగా వుంచు. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా అప్పుడివి నీతో చెప్పక తీరదుకదా? మీ చిన్నాయనకి చిన్న ఆపద ఒకటి వచ్చిపడింది. ఆయన ఏదో లంచాలద్వారా వేలు వెనకేశాడని-ఒక దుమారం రేగింది. చూశావా రామూ ఎంత దారుణమో. మంత్రి మొదలుకొని, మా యింట్లో పనిచేసే జవాను వరకూ-అంతా లంచాలు మేస్తున్నవారే. మంత్రులాంటివాళ్ళు చేస్తే వారిని అడిగే దమ్ముల్లేవు. నోరూ, వాయీ, లేని మీ చిన్నాయనవంటి వారిమీద ఉత్త పుణ్యానికే విరుచుకుపడతారు. కేసులా, ఎంక్వైరీలూ నెత్తిన రుద్దుతారు. దేవుడు మేలు చెయ్యాలి కానీ-ఇట్లాంటిని ఏమీ చెయ్యలేవు మనల్ని.

ఏది ఏమైనా మన జాగ్రత్తలో మనం వుండాలికదా? నువ్వు మునసబువి గనక నీ దగ్గరికి సి. ఐ.డి. ఎంక్వైరీ వస్తుంది. ఆ సి. ఐ. డి. ముండాకొడుకులు వచ్చినపుడు, పకడ్బందీగా, ఒక స్టేటుమెంటు రాసి వాళ్ళ ముఖాన కొట్టు. ఆ స్టేటుమెంటులో-నువ్వు అట్టే పెద్దగా రాయవలసింది కూడా ఏమీలేదు. మాకు ఆ వూర్లో నాలుగెకరాల పొలం వున్నట్టు, దాని మీద సాలీనా, నాలుగువేలు ఆదాయం వస్తున్నట్టూ-రాస్తే సరిపోతుంది. వాళ్ళు ఆ పొలం చూడాలంటే తీసికెళ్ళి చూపించు. తర్వాత జాగ్రత్తలు ఇక్కడ మేం తీసుకుంటాము. ఈ విషయాలు కాస్త రహస్యంగా ఉంచు. అమ్మని అడిగినట్లు చెప్పు. పిల్లలకి ఆశీస్సులు.

ఉత్తరం చదవడం ముగించేను. నా చుట్టూ వున్నవాళ్ళు నే చదివిందంతా విన్నట్టు లేదు. ఉత్తరంలో వాళ్ళకి కావలసిన అంశం దొరికింది: పిన్ని డబ్బు పంపుతోంది!

అంతా తెగ మురిసిపోతున్నారు!